## క్లుప్తంగా

### రోడ్డు పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, తదితరులు

మద్దిపాలెం : జీవీఎంసీ 51వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పరిశీలించారు. అంబేడ్కర్ కాలనీలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.15లక్షలతో పనులు చేపట్టేందుకు గతంలోనే శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం చేస్తున్న ఆ పనులను కార్పొరేటర్ సోమవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

### అయోడిన్ ఉప్పుతో ఆరోగ్యం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు

మద్దిపాలెం : అయోడిన్ కలిగిన ఉప్పు వాడకం వల్ల పిల్లలు శారీరకంగా, మానసికంగా వృద్ధి చెందుతారని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవో రమణకుమారి సూచించారు. జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అయోడిన్ ఉప్పు వల్ల కలిగే ప్రయోజనాలపై సోమవారం అవగాహన కల్పించారు. అయోడిన్ లోపం వల్ల ఎదురయ్యే శారీరక, మానసిక రుగ్మతలను తెలియజేశారు. గర్భం దాల్చినప్పటి నుంచి ఆరోగ్య సంబంధిత విషయాలపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మద్దిపాలెం సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతి, మహిళా పోలీస్ వరలక్ష్మి, టీచర్ మాలా బీబీ, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందిస్తున్న ఎంఈవో దివాకర్

మురళీనగర్ : జాతీయ స్థాయిలో పాఠశాల విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరు చేసేందుకు నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన మెటీరియల్‌ను వింగ్స్ ఫౌండేషన్ సంస్థ సోమవారం అందించింది. ఈ మేరకు అల్లూరి సీతారామరాజునగర్‌లోని కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ పుస్తకాలు ఎంఈవో దివాకర్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్ఎస్ఎం సాయిలక్ష్మి, ఫౌండేషన్ నిర్వాహకుడు ఎం.ఆనంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఆటోలో పాము కలకలం



ఆటోలోకి దూరిన పామును తీస్తున్న స్థానికులు

మద్దిపాలెం : జీవీఎంసీ 53వ వార్డు పార్వతీనగర్‌లో పాము కలకలం రేపింది. ఈ మేరకు పార్వతీనగర్ జాతీయ రహదారి సేవా మార్గంలో రోడ్డు పక్కన డివైడర్ వద్ద ఓ ఆటో డ్రైవర్ ఆటోను రోడ్డు పక్కన నిలిపారు. ఇంతలో అక్కడ ఉన్న పాము ఆటోలోకి దూరిపోయింది. ఎంతసేపు వెతికినా చిక్కలేదు. చివరకు ఆటో అంతా గాలించి చూస్తే ముందు టైర్ భాగం లోపలికి దూరిపోవడంతో బయటకు తీశారు. దీంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు.



# హరహర మహాదేవ

- నియోజకవర్గంలో కిటకిటలాడిన శివాలయాలు
- ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేసిన భక్తులు



సీతంపేట పార్వతీశ్వరాలయంలో భక్తులు



పూజలందుకున్న ఉమానీలకంఠేశ్వరస్వామి



సీతంపేటలో ఉజ్జయినీ మహాకాళేశ్వరుడు అలంకారంలో దర్శనమిచ్చిన పార్వతీశ్వరుడు

సీతమ్మధార : కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శివాలయాల్లో తొలి సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని దేవాలయాలన్నీ తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. నక్కవానిపాలెంలో గల శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. అర్చకులు రామారావు శర్మ, ఉమామహేష్ పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు. ఆకాశ దీప ప్రారంభం, ఏకాదశి, క్షీరాబ్ది ద్వాదశి, సహస్ర ఘటాభిషేకం, పోలి పాడ్యమి నిర్వహిస్తామని తెలిపారు. అలాగే నవంబర్ 15న జ్వాలా తోరణం వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

- నార్త్ ఎక్స్‌టెన్సన్‌లో గల శివాలయంలో కార్తీక మాసం తొలి సోమవారం పూజలు ఘనంగా నిర్వహించారు. దీపారాధన, శివారాధనతో భక్తులు పరవశించిపోయారు.

సీతంపేట : కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా నియోజకవర్గంలోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున 4 గంటల నుంచే అభిషేకాలు, అర్చనలు, రుద్రహారతులు, భక్తుల శివనామస్మరణతో ఆలయాలన్నీ కార్తీక శోభను సంతరించుకున్నాయి. సీతంపేట గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు శివాజీ శర్మ, భాస్కరశర్మ వేకువజాము నుంచే శివునికి జలాభిషేకం, క్షీరాభిషేకం, అనంతరం పంచామృతాభిషేకం జరిపారు. మొదటి సోమవారం సందర్భంగా శివలింగాన్ని ఉజ్జయినీ మహాకాళేశ్వరుడు అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించారు. సాయంత్రం మేళతాళాల మధ్య పార్వతీశ్వరునికి 16 రకాల హారతులిచ్చారు. ఆలయ ఈవో రమాభాయి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు ఉదయాన్నే శివునికి జలాభిషేకం అనంతరం పంచామృతాభిషేకం జరిపారు. పురాతన ఆలయం కావడంతో పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అర్చన, అభిషేకాలు జరిపించారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరి, జమ్మి, మారేడు, నేరేడు, రావి చెట్లకు మహిళలు పూజలు చేసి దీపాలు వెలిగించారు.
- అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో శివుని దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. పీఠం ఆవరణలో ఉన్న శివలింగానికి భక్తులు జలాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. మణిద్వీపంలో విజయగణపతి, కామేశ్వరునికి ఏకవార అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం కాళీ కాలభైరవులకు ఏకవార అభిషేకం, విశేష హారతులిచ్చారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కంచరపాలెం: జీవీఎంసీ 46, 47, 48, 54, 55 వార్డుల పరిధి కంచరపాలెంలోని పలు శివాలయాల్లో కార్తీమాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. 104 ఏరియా బాపూజీనగర్, కోదండ కాశీవిశ్వేశ్వరాలయంలో ఆనువంశిక ధర్మకర్త ఎడ్ల శ్రీనివాసరావు, ప్రధాన అర్చకులు ఎం.సూర్యప్రకాశ్‌శర్మ, తిక్కవానిపాలెంలోని అన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో రామకృష్ణ శర్మ, కంచరపాలెం మెయిన్‌రోడ్డులో గౌరీ పరమేశ్వరాలయంలో అర్చకులు శ్రీనివాసదీక్షితులు, సుభాష్‌నగర్‌లో ధర్మగర్భ ఆత్మలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు జగన్మోహన్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. శివాలయాల్లో తెల్లవారుజాము నుంచి శివనామస్మరణ మార్మోగింది. విబూది అభిషేకాలు, బిల్వార్చన, క్షీరాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులే స్వహస్తాలతో శివలింగానికి అభిషేకాలు జరిపారు. భక్తుల సౌకర్యం కోసం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



రామలింగేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



శ్రీలలితాపీఠంలో కాళీ కాలభైరవులకు ఏకవార అభిషేకం చేస్తున్న అర్చకులు



ధర్మగర్భ ఆత్మలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

## రైతుబజార్ పరిసరాల్లో ఆక్రమణల తొలగింపు



రైతుబజార్ వద్ద ఆక్రమణల తొలగింపును పర్యవేక్షిస్తున్న సీఐ ప్రసాద్

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార : ఎట్టకేలకు సీతమ్మధార రైతుబజార్ చుట్టుపక్కల గల ఆక్రమణలు తొలగించారు. వినియోగదారుల వాహనాల పార్కింగ్‌కి తీవ్ర ఆటంకం కలగిస్తున్న తోపుడుబళ్లను అక్కడి నుంచి తరలించారు. రైతుబజార్ పరిసరాల్లో ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్‌తో కొనుగోలుదారులు, స్థానికులకు ఎదురవుతున్న ఇబ్బందులపై 'పార్కింగ్ అస్తవ్యస్తం' శీర్షికతో 'సాక్షి'లో సోమవారం ప్రచురించిన కథనానికి ట్రాఫిక్ పోలీసులు, జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ సిబ్బంది స్పందించారు. ద్వారకా జోన్ ట్రాఫిక్ సీఐ కేఎస్ ఎస్‌వీ ప్రసాద్ పర్యవేక్షణలో ఎస్ఐలు భాస్కర్, ఎంవీపీ ట్రాఫిక్ ఎస్ఐ, ఏఎస్ఐ, ఇతర పోలీసు సిబ్బంది, జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, సచివాలయం టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులు హరీష్, గాయత్రి, దుర్గాసాయి, చైన్‌మెన్ ప్రసన్న సహకారంతో ఆక్రమణలు తొలగించారు. రైతుబజార్ మూడు వైపులా గల తోపుడుబండి ఆక్రమణలు పూర్తి స్థాయిలో తొలగించారు. ఈ సందర్భంగా సీఐ ప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు మీద తోపుడుబండ్లతో ట్రాఫిక్‌కి ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన చోదకులు కూడా క్రమపద్ధతిలో వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం పలు తోపుడుబండ్లను జోన్ – 3 టౌన్‌ప్లానింగ్ వాహనంలో తరలించారు. 'సాక్షి' పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించడంతో స్థానికులు, రైతుబజార్ వినియోగదారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అలరించిన 'వినోదాల విందు'



స్కిట్ ప్రదర్శిస్తున్న కళాకారులు

సీతంపేట : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన 'వినోదాల విందు' ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించింది. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో కళాకారులు జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజు, కుమారి, చిదంబరం, శివజ్యోతి, భాను ప్రకాష్, నాయుడు, పోర్టు శేషు, ఇమంది ఈశ్వరరావు, సీత తదితరులు కామెడీ స్కిట్స్ ప్రదర్శించారు. వీటిలో స్టంట్ మాస్టర్, జ్యోతిష్యం, థమ్సప్ రికార్డు, చికెన్ 65, ఐదు వందల రూపాయల అప్పు, డాక్టర్ బర్త్‌డే గిఫ్ట్, హోటల్ రూం, మెడ పట్టేసింది స్కిట్స్ ఆహూతులను నవ్వుల్లో ముంచెత్తాయి. కార్యక్రమంలో భాగంగా హరిహర నృత్య నికేతన్ నాట్య గురువు అల్లు వెంకటరమణ పర్యవేక్షణలో అల్లు అనూష, కోట అనూష, మామిడిశెట్టి హృతిక, కోరాడ గాయత్రి ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. నంది అవార్డు గ్రహీత వంకాయల మారుతీ ప్రసాద్‌కు కలియుగ వీరబాహుడు బిరుదును తిలక్ పట్నాయక్, సన్ మూర్తి, కోన మహేష్, దాడి సత్యనారాయణ చేతుల మీదుగా ప్రదానం చేశారు.

## బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

శృంగవరపుకోట: విశాఖపట్నంలోని కంచరపాలెం ప్రాంతానికి చెందిన గూడి ఉదయ్‌కుమార్ (23) బైక్‌పై వెళ్తూ విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలోని శిరికి రిసార్ట్ వద్ద ప్రమాదానికి గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్నేహితుడు యల్లబిల్లి ధనుంజయ్‌తో కలిసి ఉదయ్‌కుమార్ ఈ నెల 2న బైక్‌పై అరకు వెళ్లాడు. వారిద్దరూ తిరిగి 3న అరకు నుంచి విశాఖ వస్తుండగా అర్ధరాత్రి 1 గంట సమయంలో శిరికి రిసార్ట్ జంక్షన్‌కు వచ్చేసరికి కుక్క అడ్డంగా రావడంతో బైక్ అదుపు తప్పి బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో ఉదయ్‌కుమార్ రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమై ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. స్నేహితుడు ధనుంజయ్‌కు కాలు విరిగిపోవడంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. మృతుడి మేనమామ బోరి సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.కోట ఎస్ఐ సీహెచ్ గంగరాజు తెలిపారు.

## కొండవాలులో సమస్యల పరిష్కారానికి కృషి



వైశాఖి స్పోర్ట్స్ పార్కులో పరిశీలిస్తున్న జెడ్సీ రాము

మురళీనగర్ : కొండవాలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని జోన్ – 5 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్థానికులకు హామీ ఇచ్చారు. మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో జెడ్సీ సోమవారం పర్యటించారు. సాయిరామ్‌నగర్‌లో వర్షాకాలంలో ఎగువ కొండనీరు దిగువకు ప్రవహించినప్పుడు దిగువనున్న నివాసితులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన వైశాఖి స్పోర్ట్స్ పార్కును సందర్శించారు. విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ఇతర సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. పార్కు నిర్వహణపై జెడ్సీ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఈఈ టి.ప్రసన్న, ఏఈలు సతీష్, సాయినాథ్, సుమన్, ఏఎంవోహెచ్ ఎ.సునీల్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### 'స్టెల్లా మేరీ'పై చర్యలకు వినతి

మహారాణిపేట: హిందువుల మనోభావాలు కించపరుస్తున్న స్టెల్లా మేరీ స్కూలు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట వీహెచ్‌పీ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. దీపావళి పండగ చేయొద్దని చిన్న పిల్లలతో ప్రదర్శన నిర్వహించిన స్టెల్లా మేరీ యాజమాన్యం హిందువుల మనోభావాలను దెబ్బతీసిందని వీహెచ్‌పీ నాయకులు పల్లా అజయ్ యాదవ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇలాంటి సంస్థల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

## ప్రజా సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జెడ్సీ శివప్రసాద్



వినతి స్వీకరిస్తున్న తహసీల్దార్ రమేష్



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ రాము

సీతమ్మధార : నగరంలోని ఆశీలమెట్టలో గల జోన్ – 3 కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ నాలుగు ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు పరిశీలించి తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారం సమాచారాన్ని సంబంధిత ఫిర్యాదుదారులకు ఎప్పటికప్పుడు అందజేయాలని సూచించారు.

కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గంగాధర్, ఏసీపీ మధుసూధనరావు, యూసీడీ విభాగం అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎల్.రాము, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 10 వినతులు**

స్థానిక సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుంచి తహసీల్దార్ ఎం.రమేష్ పది వినతులు స్వీకరించారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్వోలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్ – 5 కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు ఏడు వినతులు అందాయి. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము వినతులు స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 05, పబ్లిక్ హెల్త్ విభాగానికి 02 వినతులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్న రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్ కుమార్, ఏపీడీవోలు కృపానందం, కేవీ పుణ్యవతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పగలూ వెలుగులే..!

- రోజంతా వెలుగుతున్న విద్యుత్ దీపాలు
- పట్టించుకోని ఆ శాఖ అధికారులు



హరిత పార్కులో రోజంతా వెలుగుతున్న విద్యుత్ దీపాలు



పీ అండ్ టీ కాలనీ వద్ద పగలు కూడా వెలుగుతున్న మోడ్రన్ లైట్లు



మాధవధారలో పగలూ వెలుగుతున్న విద్యుత్ దీపం

మురళీనగర్ : విద్యుత్ ఆదా చేయాలని అందరికీ సుద్దులు చెప్పే విద్యుత్ శాఖ అధికారులు వీధి లైట్ల నిర్వహణలో నిర్లక్ష్యంగా వహిస్తున్నారు. దీంతో రాత్రి వెలగాల్సిన విద్యుత్ దీపాలు ఉదయం కూడా వెలగడంతో విద్యుత్ వృథా అవుతోంది. మురళీనగర్ సెక్టార్ – 8లోని హరిత పార్కులో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు గత మూడు నెలలుగా రోజంతా వెలుగుతూనే ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. జీవీఎంసీ విద్యుత్ సరఫరా విభాగానికి, వీధి లైట్ల నిర్వహణ విభాగానికి స్థానికులు ఫిర్యాదు చేసినా అవి తమ పరిధిలో లేవని తప్పించుకుంటున్నారు. ఏపీఈపీడీసీఎల్ అధికారులూ తమ పరిధి కాదని చర్యలు తీసుకోవడం లేదు. పరిధి ఎవరిదైనా విద్యుత్ వృథాను అరికట్టాలన్న బాధ్యత నుంచి తప్పించుకోవడం పట్ల పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ రెండు విభాగాల అధికారులు తక్షణమే విద్యుత్ దీపాల పరిస్థితిని పరిశీలించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సీతమ్మధార : అయితే అతివృష్టి.. లేకుంటే అనావృష్టి అన్న నానుడి నియోజకవర్గంలోని విద్యుత్ శాఖ విభాగానికి అతికినట్టు సరిపోతుంది. కొన్ని ప్రాంతాల్లో రాత్రి పూట విద్యుత్ దీపాలు వెలగక స్థానికులు ఇబ్బందులు పడుతుంటే... మరికొన్ని ప్రాంతాల్లో మాత్రం రాత్రిపగలూ అన్న తేడా లేకుండా లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. ఫలితంగా విద్యుత్ వృథా అవుతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మద్దిలపాలెం నుంచి గురుద్వారా వైపు వెళ్లే జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లోని మోడ్రన్ లైట్లు పగలు కూడా వెలుగుతూనే ఉన్నాయి. చాలా రోజులుగా ఇక్కడి లైట్లు నిత్యం దేదీప్యమానంగా వెలుగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. ఇంకా సీతమ్మధార, నక్కవానిపాలెం, పీ అండ్ టీ కాలనీ, బాలయ్యశాస్త్రి లే అవుట్ తదితర కాలనీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మద్దిపాలెం : జీవీఎంసీ 50వ వార్డు మాధవధార ప్రధాన రహదారి పక్క రోడ్డులో వీధి దీపాలు గత రెండు నెలలుగా రాత్రి పగలు తేడా లేకుండా వెలుగుతున్నాయి. అయినప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సచివాలయ సిబ్బందికి చెప్పినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఇలా నిత్యం దీపాలు వెలగడం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మార్కెట్‌లో నాగుల చవితి సందడి



కంచరపాలెం రైతుబజారులో వినియోగదారులు

కంచరపాలెం : కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా, మద్రిపాలెం, జ్ఞానాపురం, తాటిచెట్లపాలెం తదితర ప్రాంతాల్లో మార్కెట్లు నాగులచవితి సామగ్రి కొనుగోలు చేసే వినియోగదారులతో సోమవారం కళకళలాడాయి. మంగళవారం నాగుల చవితి వేడుకకు కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో పుట్టలు సిద్ధం చేశారు. ఇందుకోసం కొబ్బరికాయలు, అరటిపండ్లు, పువ్వులు, పత్రి, నువ్వులు, తాటిటెంకలు తదితర సామగ్రికి డిమాండ్ ఉండడంతో వ్యాపారులు అధిక ధరలకు విక్రయించారు. వీటి ధరలు ఎక్కువగా ఉండడంతో వినియోగదారులు తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేశారు. కంచరపాలెంలో బీఆర్‌టీఎస్ రహదారికి ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయడంతో వారిని ఫ్లైఓవర్ వంతెనపైకి తరలించారు. సాయంత్రం రహదారులన్నీ వినియోగదారులు, వ్యాపారులతో రద్దీగా కనిపించాయి. వాహనాల రాకపోకలను ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది నియంత్రించారు.

## రైతు నిజాయితీ



ఆదిలక్ష్మికి పర్సు అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార : సీతమ్మధార రైతుబజారులో ఓ రైతు తన నిజాయితీతో అందరి మన్ననలూ అందుకున్నారు. అసలేం జరిగిందంటే... సోమవారం రాత్రి రైతుబజారులో పూజ సామగ్రి కోసం కేఆర్ఎం కాలనీకి చెందిన ఆదిలక్ష్మి అనే మహిళ వచ్చారు. ముందుగా అరటి పళ్లు కొనుగోలు చేసిన ఆమె అక్కడి నుంచి వేరే స్టాల్ వద్దకు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేశారు. అనంతరం డబ్బులు ఇచ్చేందుకు చూడగా నగదు, ఫోన్ ఉన్న పర్స్ కనిపించలేదు. అప్పటికే అరటి పళ్లు విక్రయించే రైతు డి.దుర్గ ఆ పర్సు గమనించి రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబుకు అందించాడు. దీంతో ఆయన మైక్‌లో ప్రకటించడంతో ఆదిలక్ష్మి వెళ్లి సంప్రదించారు. డబ్బులు, ఫోన్ ఉన్న పర్సును ఆమెకు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ అందించారు. రైతు దుర్గ నిజాయితీకి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## గంగకు పరిహారమివ్వాలని వినతి



కలెక్టర్ కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

మహారాణిపేట : ఎంవీపీ క్రైమ్ పోలీసులు కొట్టడంతో కాలు విరిగిపోయిన గంగకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు కలెక్టర్‌కి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.మణి, ఇంటి పని వారి సంఘం గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరావు, కార్మికులు ఎం.దేవి, పి.కుమారి, ఎస్.గౌరి, పి.దేవి, వై.దుర్గా భవాని, జి.పద్మ, తదితరులు వినతిపత్రం సమర్పించారు.

ఆక్సిజన్ టవర్స్ నివాసి ప్రియాంక తప్పుడు ఫిర్యాదుతో ఎస్ఐ నరవ జగదీష్, మరో ఇద్దరు మహిళ కానిస్టేబుళ్లు కలిసి గంగపై విచక్షణారహితంగా కొట్టడంతో ఆమె ఎడమ కాలు విరిగిపోయిందని వినతిపత్రంలో పేర్కొన్నారు. గంగను గాయపరిచిన పోలీసులపైన, తప్పుడు ఫిర్యాదు చేసిన ప్రియాంకపైన చట్టపరమైన చర్యలు చేపట్టాలని సీపీకి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ జగదీష్‌ను సస్పెండ్ చేశారని, ప్రియాంకపై విచారణ చేస్తున్నారని వివరించారు. బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు.